క్లుప్తంగా

చీటీల సొమ్ము మోసంపై కేసు

ఎంవీపీకాలనీ: చీటీల సొమ్ము కట్టకుండా మోసగించిన తల్లీకొడుకుపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆదర్శనగర్‌కు చెందిన కోన పద్మ పలువురు మిత్రులు, స్థానికులతో కలిసి రూ.10 లక్షల చీటీలు వేశారు. అదే ప్రాంతానికి చెందిన కేరపల్లి జ్యోతి, ఆమె కొడుకు పవన్ కలిసి పలు చీటీల్లో భాగస్వాములయ్యారు. కొద్దికాలం పాటు చీటీల సొమ్మును సజావుగా కట్టిన వారు.. రూ.9 లక్షల వరకు చీటీలు పాడుకున్నారు. అనంతరం కొన్ని నెలల తరువాత చీటి సొమ్ము కట్టడం మానేశారు. రూ.5,43,625 వారు కట్టాల్సి ఉన్నప్పటికీ.. సొమ్ము కట్టకుండా కోన పద్మను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు జ్యోతి, పవన్‌లపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

మద్దిలపాలెం: నగరంలోని బీచ్ రోడ్డు వేదికగా ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరుతూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు శనివారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత వెంకోజీపాలెం నుంచి హెచ్‌బీ కాలనీ జీఆర్ నగర్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో 15వ వార్డు కార్పొరేటర్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

గో సేవలో సత్యసాయి సేవా సంస్థ



గోశాలను శుభ్రం చేస్తున్న సత్యసాయి సేవా సంస్థల యువత

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో శనివారం గో సేవ కార్యక్రమం నిర్వహించారు. సేవా సంస్థల్లోని యువత రామకృష్ణాపురం సమీపంలోని సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాలకు వెళ్లి సేవ చేశారు. గోశాలను పరిశుభ్రం చేయడంతో పాటు వ్యర్థాల తొలగింపు, గోవులకు స్నానం చేయించడం వంటివి నిర్వహించారు. గడ్డితో పాటు కూరగాయలు, పండ్లతో కూడిన ఆహారాన్ని గోవులకు తినిపించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో 20 మందికి పైగా సత్యసాయి సేవా సంస్థలకు చెందిన యువతీ, యువకులు పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాఖ సిటీ: నగరంలో అనధికారికంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. అతడి నుంచి 20 వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలిలా.. మహారాణిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చావుల మదుం దగ్గర అక్రమంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ ఆదేశాలతో ఏఈఎస్ టి.రాజశేఖర్ సమక్షంలో సీఐ రవికిరణ్, ఎస్ఐ ముసలనాయుడు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కాపు మురళీమోహన్ అనే వ్యక్తి డిఫెన్స్ మద్యం విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడు నావెల్ డాక్‌యార్డ్‌లో 15 ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి ఉన్న పరిచయాలతో మద్యం బాటిళ్లను సేకరించి అధిక ధరలకు విక్రయిస్తూ ఉంటున్నట్లు గుర్తించారు. మురళీమోహన్‌పై మహారాణిపేట ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సీతంపేట: ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై రిటైర్డ్ ఉద్యోగులు అవగాహన పెంపొందించుకోవాలని సభాధ్యక్షుడు డీజీఎస్ జి.వాసుదేవమూర్తి సూచించారు. ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏజీఎస్ టి.కామేశ్వరరావు, ఈసీ మెంబర్ ఎం.సూర్యభాస్కరరావు, కోశాధికారి జి.ముత్యుంజయరావులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం, హౌసింగ్ లోన్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ముందుగా ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు నివాళులర్పించారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట



13వ వార్డు దారపాలెంలోని ప్రభుత్వ భూమిలో అనధికార నివాసాలు

- 13వ వార్డులో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణ
- కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి రూరల్ రెవెన్యూ అధికారులు
- దారపాలెంలో మిగిలిన భూముల సంరక్షణకు చర్యలు
- 1.20 ఎకరాల ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



రేకుల షెడ్ ఆవరణలో హెచ్చరిక బోర్డు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు దారపాలెంలోని ప్రభుత్వ భూముల సంరక్షణకు రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొంత భూమిని కోల్పోగా.. మిగిలిన దానిని సంరక్షించుకునేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా దారపాలెంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో గుర్తిస్తున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఈ ప్రాంతంలోని సర్వే నంబర్ 15/12లో ప్రభుత్వానికి చెందిన 3.07 ఎకరాల భూమి ఉండేది. దానిలోని చిన్న చిన్న స్థలాలను కొందరు ఆక్రమించుకుని బయట వారికి విక్రయించేశారు. అవి తమ పూర్వీకులకు చెందినవంటూ కొందరు వేరే సర్వే నంబర్లతో తణుకు, గుంటూరు ప్రాంతాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించి ఇతరులకు విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. వీటికి కొందరు రూరల్ రెవెన్యూ అధికారులు సహకరించినట్లు విమర్శలున్నాయి. ఇక్కడ ప్రభుత్వానికి చెందిన 3.07 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని ఇటీవల కొందరు స్థానికులు కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. వాటికి స్పందించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆ స్థలమంతటినీ 22–ఏ జాబితాలో పెట్టేశారు. అనంతరం అక్కడ భూమిని సర్వే చేయాలని రూరల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో ఆక్రమణదారుల గొంతులో వెలక్కాయ పడినట్లయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడ ఆక్రమణల జోరు పెరిగింది. దానికి ప్రస్తుత కలెక్టర్ కళ్లెం వేశారు.

రూ.కోట్ల విలువైన భూములు

ఈ ప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. చదరపు గజం మార్కెట్ ధర రూ.50 వేలకు పైగా ఉంది. దీన్ని బట్టి ఇక్కడ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి ధర సుమారు రూ.40 కోట్లు ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. ఆ భూమిని కొందరు ఇళ్ల స్థలాలుగా చేసి విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడు వారి ఆక్రమణలకు కలెక్టర్ ఆదేశాలతో రూరల్ రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఈ భూమిని 22–ఏ జాబితాలో చేర్చడంతో ఇప్పటికే స్థలాలు ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం డబ్బు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

14 ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కలెక్టర్ ఆదేశాలతో రూరల్ రెవెన్యూ అధికారులు ఇటీవల దారపాలెం సర్వే నంబర్ 15/12లో సర్వే చేపట్టారు. సగం కంటే ఎక్కువ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమించిన ప్రభుత్వ స్థలాల మధ్యమధ్యలో 34 నివాసాలు నిర్మించేశారు. వాటి మధ్య మిగిలిన 19 స్థలాలు ఖాళీగా ఉన్నాయి. వాటిలోని 14 స్థలాల్లో రెవెన్యూ అధికారుల ఆదేశాలతో స్థానిక వీఆర్వో సత్యందొర ఆధ్వర్యంలో సిబ్బంది రెండు రోజుల పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మరో 5 ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. దీన్ని అనుకుని ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాల్లో కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ ఖాళీ స్థలాలన్నీ కలిపి 1.20 ఎకరాల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీన్ని బట్టి ఇక్కడ ప్రభుత్వానికి చెందిన సుమారు 1.87 ఎకరాల స్థలం ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం ఇక్కడ ఆక్రమించిన స్థలాల్లో 34 నివాసాలున్నాయి.





ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

1.20 ఎకరాల ప్రభుత్వ స్థలం స్వాధీనం

దారపాలెం సర్వే నంబర్ 15/12లో 3.07 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దానిలో కొంత ఆక్రమణకు గురైంది. ఇటీవల ఆ స్థలాన్ని కలెక్టర్ 22–ఏ జాబితాలో చేర్చారు. 1.20 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకుని సర్వే చేయగా దానిలో 34 నివాసాలు నిర్మించేశారు. మిగిలిన 19 ఖాళీ స్థలాలను గుర్తించాం. వాటిలో రెండు రోజుల కిందట 14 చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. మరో 5 చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ఆక్రమించిన స్థలాల్లో నివాసాలు నిర్మించుకున్న వారు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

– పాల్‌కిరణ్, తహసీల్దార్, విశాఖ రూరల్ మండలం

విస్తృతంగా 'యోగాంధ్ర' క్యాంపెయిన్



యోగాసనాలు వేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు, యోగా టీచర్లు, విద్యార్థులు

మహారాణిపేట: ఈ నెల 21న విశాఖ వేదికగా.. 'విశ్వమంతా యోగాతో ఆరోగ్యం' అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత భారీగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. యోగాంధ్ర–2025పై విస్తృత ప్రచారం కల్పించడం, భారీ సంఖ్యలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు నెల రోజుల కార్యాచరణను జిల్లా యంత్రాంగం రూపొందించింది. ఇందులో భాగంగా శనివారం ఆర్.కె.బీచ్ వద్ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ అపెక్స్ సభ్యురాలు యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ యోగా దినోత్సవం రోజున 5 లక్షల మందితో విశాఖ బీచ్ రోడ్డు వేదికగా జరగనున్న యోగా కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రజలందరూ పాల్గొని గిన్నీస్ రికార్డు సాధించాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ అపెక్స్ మెంబర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ నిరంతర యోగా సాధన ప్రతి వార్డు స్థాయిలో జరిగేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. శ్రీ శ్రీ యోగా స్టేట్ కో ఆర్డినేటర్ రాణి ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు, స్పోర్ట్స్ స్టూడెంట్లు, యోగా టీచర్లు సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఆయుష్ ఆర్‌డీడీ ఝాన్సీ, డీఎస్‌డీవో జూన్, నోడల్ ఆఫీసర్ శైలజ, యోగా ఆచార్య రవికిశోర్, శంకరనారాయణ, శారదవల్లి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ 23వ వార్డు కమిటీ ఎన్నిక



23వ వార్డు నూతన కమిటీ సభ్యులతో పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డుకు వైఎస్సార్‌సీపీ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు తెలిపారు. వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం వార్డు కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథి మొల్లి అప్పారావు సమక్షంలో వార్డు శ్రేణుల ఆమోదంతో కమిటీ ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఏ కార్యక్రమం తలపెట్టినా వార్డు నుంచి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. తాను అందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడే కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు లభించేలా తాను బాధ్యత తీసుకుంటానని మొల్లి అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బోస రమణరెడ్డి, నగిరెడ్ల పోలిరెడ్డి, పిలక మధుసూదనరెడ్డి, కె.వి.రమణ, పెద్దరెడ్డి, పులగం కొండారెడ్డి, శశికళ, అరుణ, పులగం శ్రీనివాసరెడ్డి, సుధీర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, పిలక సంపత్‌రెడ్డి, గుడ్ల నర్సింగ్‌రెడ్డి, బోస రమణ, వీర, శ్రీను, దుర్గ, వెంకటలక్ష్మి, రమణమ్మ, మణి, కుసుమ, ధనలక్ష్మి, త్రినాథ్, సూరిబాబు, కుమార్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంబాలకొండలో చెక్క వంతెన



చెక్క బ్రిడ్జికి ప్రవేశ ద్వారం



కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో కొండపై ఏర్పాటు చేస్తున్న కర్రల బ్రిడ్జి

ఆరిలోవ: జాతీయ రహదారి పక్కన కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో అటవీశాఖ అధికారులు చెక్కతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. సందర్శకుల వినోదం కోసం ఈ బ్రిడ్జిని పూర్తిగా కలపతో సిద్ధం చేస్తున్నారు. పార్కులో క్యాంటీన్ ఎదురుగా కొండపైకి దీని నిర్మాణం చేపడుతున్నారు. కింద వెదురు పొదలు, తదితర చెట్లకొమ్మల మధ్య నుంచి కొండపైకి సుమారు 400 మీటర్ల పొడవున ఈ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 150 మీటర్లు పొడవున నిర్మాణం జరిగింది. పూర్తిగా నాణ్యమైన కలపతో దీన్ని నిర్మిస్తున్నట్లు అటవీశాఖ రేంజర్ శాస్త్రి తెలిపారు. ఇప్పటికే ఇక్కడ అభివృద్ధిలో భాగంగా అటవీ శాఖ అధికారులు పలు నిర్మాణాలు చేపడుతున్నారు. యోగా సెంటర్, కాటేజీలు, ఉడెన్ డెక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కలప వంతెన సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

సాగర తీరానికి సొబగులు

- యోగా డే వేడుకలకు ముస్తాబవుతున్న బీచ్ రోడ్డు
- విగ్రహాలు, రెయిలింగ్, ఫుట్‌పాత్‌లకు రంగులు, మరమ్మతులు
- పనుల్లో నాణ్యత అంతంత మాత్రమే



విగ్రహానికి రంగులు వేస్తున్న పెయింటర్



రెయిలింగ్, ఫుట్‌పాత్‌కు రంగులు వేస్తున్న కార్మికులు



జలకన్యలకు రంగులు వేస్తున్న కార్మికుడు



బీచ్ రోడ్డు గోడపై వేసిన యోగాసనాల చిత్రాలు



ఆర్.కె.బీచ్ జంక్షన్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన హరిత ఆంధ్ర స్థూపం

ఏయూక్యాంపస్: యోగా డే వేడుకలకు బీచ్ రోడ్డు ముస్తాబవుతోంది. ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్డు వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సాగర తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఆర్.కె.బీచ్ నుంచి రోడ్డుకు ఇరువైపులా అవసరమైన పనులను కార్మికులతో చేయిస్తున్నారు. బీచ్ రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప రెయిలింగ్‌లకు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లకు రంగులు వేసే పనులు వేగంగా జరుగుతున్నాయి. రంగుల నాణ్యత మాత్రం అంతంత మాత్రంగానే ఉందని పలువురు స్థానికులు అంటున్నారు.

కొన్ని చోట్ల మరమ్మతులు

రోడ్డుకు రెండు వైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై పలుచోట్ల పలకలు విరిగి దెబ్బతిన్నాయి. వీటిని తొలగించి కొత్తవి వేస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రమే ఈ పనులు చేపడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో విరిగిన పలకలు మార్చాల్సిన అవసరముంది. ఈ పనుల నాణ్యత సైతం తూతూ మంత్రంగానే ఉంది.

విగ్రహాలకు రంగులు.. గోడలపై చిత్రాలు

బీచ్ రోడ్డులో కొలువుదీరిన మహనీయుల విగ్రహాలకు రంగులు వేసే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం వీటిని శుభ్రం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో విగ్రహాలకు రంగులు వేసే పనులు పూర్తి చేసే అవకాశముంది. ఆర్.కె.బీచ్ వద్దనున్న మత్స్యకన్యల విగ్రహాలకు సైతం రంగులు వేస్తున్నారు. ఇక్కడ పాడైన వాటర్ ఫౌంటెయిన్‌ను పునరుద్ధరించే పనులు జరుగుతున్నాయి. విగ్రహాలకు ఇప్పుడు వేస్తున్న రంగులు ఎంతకాలం ఉంటాయనేది ప్రశ్నార్థకంగానే ఉంది. వీటితోపాటు బీచ్ రోడ్డు పక్కనే ఉన్న గోడలపై యోగాసనాల చిత్రాలను చిత్రీకరిస్తున్నారు. ఇవి అంత ఆకర్షణీయంగా లేవని పర్యాటకులు చర్చించుకుంటున్నారు.

'హరిత ఆంధ్ర' స్థూపంలో ప్లాస్టిక్ మొక్కలు

జీవీఎంసీ ప్రత్యేకంగా హరిత ఆంధ్ర పేరుతో పెయింటింగ్ బ్రెస్ ఆకారంలో ఒక స్థూపం తరహా నిర్మాణం చేపట్టింది. ఆర్.కె.బీచ్ బస్ బే వద్ద జంక్షన్‌లో ఆర్.కె.మిషన్ లైబ్రరీ నుంచి బీచ్‌కు వెళ్లే మార్గంలో దీనిని ఏర్పాటు చేసింది. దీని పైభాగంలో ప్లాస్టిక్ మొక్కలను పెట్టారు. హరిత ఆంధ్రప్రదేశ్ అని సందేశమిస్తూ ప్లాస్టిక్ మొక్కలు పెట్టి ప్రజల్లోకి ఎటువంటి సందేశం పంపుతారో చూడాలి.

గ్రంథాలయాల పరిరక్షణకు గళమెత్తిన మేధావి వర్గం



మేధామథనం సదస్సులో పాల్గొన్న మేధావి వర్గం

సీతంపేట: గ్రంథాలయాలు జ్ఞానం, విజ్ఞానం అందించడమే కాకుండా మానవ పురోగతికి దోహదపడతాయని మాజీ వీసీ ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దశ దిశ, ప్రజల కర్తవ్యం' అనే అంశంపై మేధామథనం పేరిట నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో హిందీ తర్వాతి స్థానంలో ఉన్న తెలుగులో పుస్తకాల ప్రచురణ తగ్గుతోందని, పబ్లిషింగ్ సంస్థలు కూడా మూతపడుతున్నాయని చెప్పారు. కేరళలోని గ్రంథాలయాల నిర్వహణ తీరును వివరిస్తూ, మన రాష్ట్రంలో వెనుకబాటుతనాన్ని తెలియజేశారు. గ్రంథాలయాల పరిరక్షణకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. ప్రజల నుంచి సెస్ వసూలు చేస్తున్నా.. లైబ్రరీలకు నిధులు విడుదల చేయట్లేదన్నారు. ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల వెనుకబాటు వల్ల సమాజానికి కలిగే నష్టాన్ని వివరించారు. మాజీ వీసీ రొక్కం సుదర్శన్ మాట్లాడుతూ మానవ అభివృద్ధికి నాంది పలికే గ్రంథాలయాలను ప్రజల ఆస్తిగా భావించాలన్నారు. జీవీఎంసీ నుంచి గ్రంథాలయాలకు రూ.117 కోట్లు బకాయి ఉందని తెలిపారు. మాజీ వీసీ ఆచార్య హెచ్.లజపతిరాయ్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లో చదువుకునేలా అలవాటు చేయాలన్నారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఫౌండర్ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాల విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా ఉందో చెప్పాలన్నారు. ఆచార్య జి.నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ రీజనల్ లైబ్రరీ దీనావస్థను వివరించారు. యువతను భాగస్వామ్యం చేసి ఉద్యమం నడపాలన్నారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సాహితీవేత్త నల్లి ధర్మారావు, డి.వి.సూర్యారావు, పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ, సాహితీవేత్తలు మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, కె.నరసింహం, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్ స్టేషన్లలో 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్ క్యూఆర్ కోడ్



మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ బార్‌ను ప్రారంభిస్తున్న అప్పలనాయుడు

మద్దిలపాలెం: ఈ నెల 21న ఆర్కే బీచ్ రోడ్డు నుంచి భీమిలి వరకు జరిగే యోగాంధ్ర మెగా ఈవెంట్‌ను తిలకించడానికి వచ్చే వారి పేర్ల నమోదుకు మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ బార్ ఏర్పాటు చేశారు. దీనిని శనివారం జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు క్యూఆర్ కోడ్లు ప్రభుత్వం రూపొందించి అందజేసినట్లు తెలిపారు. వీటిని బస్ స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు, సిబ్బందికి రిజిస్ట్రేషన్ ఎలా చేయాలో వివరించారు. మొబైల్‌లో స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ కావచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను వివిధ జిల్లాల నుంచి రప్పించి తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ గురించి ప్రయాణికులందరికీ డిపో మేనేజర్, మద్దిలపాలెం స్టేషన్ యూనిట్ ఇన్‌చార్జి, సూపర్‌వైజర్లు వివరిస్తారన్నారు.